సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 6 । జూలై । 2025



రేబిస్‌తో జాగ్రత్త 8లో ▸

పశుపోషకులు, జంతు ప్రేమికులు జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కథనం..



అరకొర సిబ్బంది.. అద్దె గదులు

జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. సరిపడా సిబ్బంది, కనీస వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /26.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు చెన్నూర్‌కు మంత్రి వివేక్‌వెంకటస్వామి రాక

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గాన్ని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కోటపల్లిలోని పౌరసరఫరాల గోదాంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తారు. 11గంటలకు కోటపల్లి పీహెచ్‌సీలో ఆర్వోఆర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రలు అందజేస్తారు. 12.30 గంటలకు చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదు కొత్త బస్సులను ప్రారంభిస్తారు.

తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ

నెన్నెల: స్థానిక తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇద్దరిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అధికారులు బదిలీపై వెళ్తున్నప్పటికీ నెన్నెల మండలానికి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం భూ భారతి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. తహసీల్దార్‌ను దరఖాస్తుల పరిశీలన అనంతరం రిలీవ్ చేయనున్నట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ వసతిగృహాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డీడీ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వసతి గృహంలో పనిచేస్తున్న కామాటి, కుక్, వాచ్‌మెన్‌లకు ఏడు నెలలుగా వేతనాలు రావటం లేదని తెలిపారు. కాంట్రాక్టర్ ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సరిగా చెల్లించడం లేదని ఆరోపించారు. వేతనాలు సంవత్సరానికి రెండుసార్లే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా చెల్లించేలా చర్యలు చేపట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహ నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు మోతే పోచయ్య, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి శంకర్, కార్యాలయ కార్యదర్శి సునీత, జిల్లా కమిటీ సభ్యులు విమల, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సంధాని

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎండీ సంధాని తెలిపారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత న్యాయ సంహిత చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సూపరింటెండెంట్ భాస్కర్, డెప్యూటీ చీఫ్ శ్రీనివాస్, అసిస్టెంట్లు రాములు, సదయ్య, కళాశాల ప్రిన్సిపల్ మోహన్, వైస్ ప్రిన్సిపల్ మహేశ్వర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ నగేశ్, ప్రమోద్, సంతోష్‌గౌడ్, కిరణ్, సంధ్య, ఉదయశ్రీ, శృతి, శరణ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, వినయ్, సురేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రభుదాస్

నస్పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మంచిర్యాల ఆర్ఎం ప్రభుదాస్ సూచించారు. పట్టణ పరిధిలోని మెప్మా కార్యాలయంలో సీతారాంపల్లి, సింగాపూర్ శాఖలు, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాల మంజూరు, ఖాతాల నిర్వహణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ రెండు శాఖల పరిధిలో ఇప్పటివరకు రూ.48కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రతీ ఏడాది రూ.20 చెల్లించి రూ.2లక్షల ప్రమాదబీమా, రూ.436 చెల్లించి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా ద్వారా సాధారణ మరణానికి రూ.2 లక్షల బీమా సదుపాయం పొందవచ్చని తెలిపారు. మేనేజర్లు నరసింహస్వామి, రాము, ఫీల్డ్ అధికారులు రవి, డేవిడ్ పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్..!

- వేలాదిగా వచ్చిన దరఖాస్తులు
- వందల్లోనే సమస్యలు పరిష్కారం
- కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ
- సాదాబైనామాలకు కలగని మోక్షం
- ఇదీ 'భూ భారతి' దరఖాస్తుల తీరు



రెవెన్యూ సదస్సులో రైతు అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్‌కుమార్ దీపక్ (ఫైల్)

జిల్లాలో భూ భారతి వివరాలు		
	రెవెన్యూ సదస్సులు : 366	మొత్తం దరఖాస్తులు : 16,871
	ఇప్పటివరకు పరిష్కరించినవి : 283	

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం సంబంధిత అధికారులు సతమతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి వేలల్లో వినతులు వచ్చాయి. కాగా, వందల సంఖ్యలోనే పరిష్కారానికి అవకాశం కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. జిల్లాలో తొలుత పైలట్ మండలంగా భీమారాన్ని ఎంపిక చేయగా, తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సదస్సుల ద్వారా 16వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటివరకు 200పైచిలుకు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా వేలాది అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

సాదాబైనామాలు..

సాదాబైనామాలు, పీవోటీ, ప్రభుత్వ భూములకు సంబంధించి 5వేలకు పైగా అర్జీలు వచ్చాయి. తెల్ల కాగితాలపై జరిగిన భూ క్రయవిక్రయాలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో వేలాదిమంది ఈ సమస్య పరిష్కారం కోసం వేచి చూస్తున్నారు. మిగతావి సర్వే నంబర్ మిస్సింగ్, 2 వేలకు పైగా డిజిటల్ సైన్ పెండింగ్‌పై వచ్చాయి. మిగతా దరఖాస్తుల్లో కోర్టు కేసులు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, భూమి రకంలో మార్పు, విరాసత్, కుటుంబ సభ్యుల పేర్లలో తప్పులు తదితర సమస్యలపై వచ్చినవి ఉన్నాయి. వీటన్నింటినీ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం అర్జీల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. అధికారులు మొదట నోటీసులు ఇస్తూ దరఖాస్తుదారుల వద్ద ఉన్న రికార్డులు, ఆధారాలను పరిశీలిస్తున్నారు.

హద్దు సమస్యలు అలాగే..

అటవీ, రెవెన్యూ హద్దుల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా అనేక దరఖాస్తులు వచ్చాయి. ఈ సమస్యల పరిష్కారానికి అటవీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సి ఉంది. ఇందుకోసం ఇరు శాఖల మధ్య రికార్డుల ఆధారంగా ఆ భూములు ఏ రకానికి చెందినవో తేల్చాల్సి ఉంటుంది. అయితే ఈ సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లడం లేదు. కొన్నిచోట్ల జాయింట్ సర్వేలు జరుగుతున్నప్పటికీ అటవీ, రెవెన్యూ శాఖలలో వేటివో స్పష్టంగా తేల్చలేకపోతున్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ భూములున్న చోట కూడా రికార్డుల్లో స్పష్టత లేక అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

పైలట్ మండలంలోనూ..

పైలట్ మండలం భీమారంలోనూ భూ సమస్యలు పరిష్కారం కాలేదు. ఈ మండలంలో 2,140 దరఖాస్తులు రాగా, వీటిలో వెయ్యికిపైగా అర్జీలు సాదాబైనామాలవే ఉన్నాయి. మొత్తంగా 200 అర్జీలు పరిష్కార యోగ్యంగా ఉన్నాయి. వీటిలో 108 అర్జీలు ఆర్డీవో స్థాయిలో సమస్య పరిష్కారానికి నివేదించారు. మిగతావి పరిశీలన దశలో ఉన్నాయి.

పత్తికే అనుకూలం

- జలాశయాల్లోకి ఇంకా చేరని నీరు
- ఆశించిన వర్షాల్లేక వరినాట్లు ఆలస్యం
- ఇప్పటివరకు నార్లు పోయని రైతులు
- ఖరీఫ్ సాగు విస్తీర్ణం 48శాతమే..

జిల్లాలో సాగు విస్తీర్ణం	
పంట	ఎకరాలు
పత్తి	1,24,809
వరి	19,567 (నర్సరీ దశలోనే)
కంది	234
మొక్కజొన్న	92
ఇతర పంటలు	86
మొత్తం	1,44,788



జైపూర్ మండలం కుందారం గ్రామంలో పత్తి పంటలో దౌర కొడుతున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: నైరుతి రుతు పవనాలు జిల్లాను తాకి నెల రోజులు గడుస్తున్నా అన్ని మండలాల్లో లోటు వర్షపాతమే నెలకొంది. అడపాదడపా కురుస్తున్న వర్షం పత్తి పంట ఎదుగుదలకు తోడ్పడుతోంది. భారీ వర్షాల్లేక చెరువులు, జలాశయాల్లోకి నీరు చేరకపోవడంతో వరి సాగు వెనుకపడుతోంది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటివరకు 202.2మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 129మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. 36శాతం లోటు నెలకొంది. పత్తి పంట విత్తుకునేందుకు ఈ నెల 15వరకు, వరిసాగు దీర్ఘకాలిక రకం నెలాఖరుతో ముగియనుంది. స్వల్పకాలిక రకం వరి నాట్లు వేసుకునేందుకు ఆగస్టు 20వరకు గడువు ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. పత్తి విత్తడం 85శాతం పూర్తయింది. పత్తి విత్తుకునేందుకు మరోవారం వరకు గడువు ఉండడంతో మరో 25వేల నుంచి 30వేల ఎకరాలు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గత నెల తొలకరి వర్షాలకు విత్తుకున్న పత్తి పంటలో మొదటి దఫాలో కలుపుతీత, దౌర కొట్టడం, ఎరువులు వేయడం లాంటి పనులు చేస్తున్నారు. పత్తి, కంది, మొక్కజొన్న పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు కురిశాయి. ఖరీఫ్ ఆరంభం నుంచి ఇప్పటివరకు 48శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు వేసుకున్నారు. వరి నాట్లు వేసుకునేంత వర్షాల్లేక రైతులు ఎదురుచూస్తున్నారు.

అంచనా 3.33లక్షల ఎకరాలు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,33,565 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటివరకు 1,44,788 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. దండేపల్లి, భీమిని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగతా మండలాల్లో 20నుంచి 60శాతం లోటు నెలకొంది. గత ఏడాది పత్తి సాగు చేయని రైతులు ఈ ఏడాది పత్తి విత్తనాలు వేసుకున్నారు. రెట్టింపు ధరలతో భూములు కౌలుకు తీసుకుని పత్తి విత్తుకుంటున్నారు. పత్తి మొక్కలు అడుగు నుంచి అడుగున్నర ఎత్తు పెరిగింది. దీంతో కలుపు నివారణకు అంతరకృషితోపాటు రసాయనిక యూరియా, 20.20, డీఏపీ ఎరువులు వేస్తున్నారు.

వరిసాగు ఆలస్యం..

జిల్లాలో వరి సాగు 1.60లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉంటుందని వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసే రైతులు చెరువులు, కుంటల్లోకి నీరు చేరకపోవడంతో నార్లు పోయలేదు. ప్రతీ సంవత్సరం లాగానే ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు ఆలస్యమవుతోంది. జూన్‌లో నారు పోసుకుంటే జూలై మొదటి వారంలో నాట్లు వేసుకోవడం మొదలు కావాల్సి ఉన్నా నెలాఖరు వరకు కూడా నాట్లు మొదలయ్యేలా లేవు. జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో ఇప్పుడిప్పుడే నార్లు పోస్తున్నారు.

దౌర కొడుతున్న



నేను ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేసిన. మొన్నటి వరకు కురిసిన ముసురు వర్షాలతో పత్తిలో కలుపు పెరిగింది. రెండు రోజులు ఆరుపులు పడుతుండడంతో గుంటుకతో దౌర కొడుతున్న. ఇప్పటివరకు అయితే పత్తికి అనుకూలంగానే వర్షాలు కురుస్తున్నయ్.

– సంతోషం దేవేందర్‌రెడ్డి, కుందారం గ్రామం, జైపూర్ మండలం

ఇంకా నారు పోయలే..



ఈ ఏడాది ముందస్తు వర్షాలు అన్నరు కాని ఆలస్యమే అవుతున్నాయి. భారీ వర్షాలు కురువక చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. పొలాల్లో నీరు నిల్వక మొలుక అలుకలేదు. ఈసారి వరి సాగు ఆలస్యమే అవుతుంది.

–గట్టయ్య, లింగపల్లి గ్రామం, చెన్నూర్ మండలం

పత్తికి ఢోకాలేదు

పోయిన నెల పత్తి విత్తుకున్న. వారం పది రోజులు వర్షాలు లేక ఎదురుచూడాల్సి వచ్చింది. పదిహేను రోజులుగా మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులు వర్షాలు తగ్గడంతో కలుపు నివారణతోపాటు ఎరువులు వేసుకుంటున్నాం. ఇప్పటి వరకైతే పత్తి పంటకు ఢోకాలేదు.

– జాపాతి నారాయణ, నెన్నెల

విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్
- కార్యాలయాల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికలు, ఆయా కార్యాలయాల పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆలస్యంగా వచ్చిన, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌ను ఆదేశించారు. అధికారులు ఆయా కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

ఈవీఎంల గోదాం పరిశీలన

జిల్లాలోని నస్పూర్‌లోగల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను కలెక్టర్ కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. గోదాం వద్ద పటిష్ట భద్రత చేపట్టినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- వెల్లివిరుస్తున్న మత సామరస్యం
- జిల్లాలో నేడు మొహర్రం పండుగ



నెన్నెలలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నెన్నెల: మహ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా ముస్లింలు మొహర్రం పండుగ జరుపుకొంటారు. ఇమామ్ హుస్సేన్ తోపాటు ఆయన కుటుంబ సభ్యులందరికీ పది రోజులపాటు నివాళులర్పిస్తారు. మొహర్రం ఉత్సవాల్లో కులమతాలకు అతీతంగా పాల్గొంటారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పీరీలను కొలుస్తారు. పది రోజుల పాటు పూజలందుకున్న పీరీలను మొహర్రం సందర్భంగా నేడు నిమజ్జనం చేయనున్నారు. హుస్సేన్, హుస్సేన్ పేరిట గ్రామాల్లో కొలువుదీరే సవార్లను (పీరీలు) భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. పీరీల వద్ద కోరుకున్న మొక్కులు తీరుతాయని ప్రజల ప్రగాఢ నమ్మకం. పీరీల మొక్కుతో పిల్లలు పుడితే ముస్లింలు వారికి హుస్సేన్, హుస్సేన్ అని పేరు పెడతారు. హిందువులైతే ఆశన్న, ఉశన్న, ఆడపిల్లలైతే ఆశక్క, ఉశక్క అని నామకరణం చేస్తారని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి పేర్లు కలిగిన వారు గ్రామాల్లో చాలా మంది ఉన్నారు. పదిరోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తారతమ్య భేదాలు లేకుండా పాల్గొంటారు. పీరీలను నమ్మేవారు మొహర్రం నెల వంక కనిపించిన నుంచి నిమజ్జనం జరిగే వరకు మద్యం, మాంసాహారానికి దూరంగా ఉంటారు. పీరీలకు మలిద ముద్దలు, కుడుకలు, బెల్లం షరబత్ నైవేద్యంగా సమర్పిస్తారు. సబ్జా ఆకులు, పూలు, కుడుకల దండలతో అలంకరిస్తారు. పీరీల వద్ద అగ్నిగుండం (అలావా) ఏర్పాటు చేసి దాని చుట్టూ కాళ్లకు గజ్జెలు కట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య లయబద్ధంగా అసైదులా ఆడతారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



పొలంబాటలో మాట్లాడుతున్న ఎస్ఈ ఉత్తమ్ జాడే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండలో శనివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఎస్ఈ ఉత్తమ్ జాడే మాట్లాడుతూ.. రైతులు వానాకాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సొంతంగా విద్యుత్ పనులు చేయవద్దని, ఎక్కడైనా వేలాడుతున్న, తెగిపడిన తీగలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జీఐ వైర్‌పై బట్టలు ఆరవేయరాదని, మేతకు వెళ్లే పశువులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైపు వెళ్లకుండా చూడాలని సూచించారు. పొలాల వద్ద మోటర్లు, స్టార్టర్లు, జీఐ పైపులున్న ప్రాంతాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. పొలంబాటలో రైతులు అనుమానాలను నివృత్తి చేస్తూ పొలాల్లో వంగి ఉన్న విద్యుత్ స్తంభాలను సరి చేయించారు. కార్యక్రమంలో ఆపరేషన్ డీఈ మహ్మద్ కైసర్, ఏఈ మహేందర్‌రెడ్డి, లైన్‌మెన్‌లు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో విధులు నిర్వర్తిస్తున్న నైట్ వాచ్‌మెన్, కుక్, స్వీపర్, స్కావెంజర్ల ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని భారత కార్మిక సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీ బ్రహ్మానందం, నాయకులు సంపత్, సునీత, మల్లేశ్వరి, హేమ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మరిన్ని కొత్త బడులు

- 20 మంది విద్యార్థులుంటే చాలు..
- మంచిర్యాలలో 15, నిర్మల్‌లో ఐదు స్కూళ్ల ప్రారంభానికి సన్నాహాలు
- అద్దెభవనాల్లో ఏర్పాటుకు చర్యలు



హాజీపూర్ మండలం వెంపల్లిలో మూతబడిన పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో యాదయ్య (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: నిరుపేద విద్యార్థులకు సర్కారు విద్యను చేరువ చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్, మంచిర్యాలలో కొత్తగా పాఠశాలలు ప్రారంభించేందుకు నిర్ణయించింది. 20 మంది, అంతకంటే ఎక్కువ పిల్లలున్న ప్రాంతాలను గుర్తించి పాఠశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనిపై శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే విద్యార్థులు లేరంటూ మూసేసిన పాఠశాలల పునఃప్రారంభానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఇప్పటికే మంచిర్యాల జిల్లాలో మూడు పాఠశాలలు పునఃప్రారంభించింది. హాజీపూర్ మండలం వెంపల్లి, లక్సెట్టిపేట్ మండలం కొత్త కొమ్ముగూడ, దండేపల్లి మండలం కొత్త మామిడిపల్లిలో పాఠశాలలు తెరుచుకున్నాయి. 'ప్రైవేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్యను సర్కారు అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 23పాఠశాలల్లో పూర్వప్రాథమిక విద్యను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం విద్యార్థులుండి బడులు లేని చోట వెంటనే కొత్తగా ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాలో 5, మంచిర్యాలలో 15 కొత్త బడులు త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం ఆయా జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఏర్పాట్లలో అధికారులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాలవారీగా కొత్త ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుపై విద్యాశాఖ అధికారులు తలమునకలయ్యారు. కిలోమీటరు లోపు ప్రైమరీ, మూడు కిలోమీటర్ల లోపు అప్పర్ ప్రైమరీ, ఐదు కిలోమీటర్లలోపు హైస్కూల్ ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఎంత మంది పిల్లలున్నారు? పాఠశాల తెరిచే అవకాశాలు ఎంత మేర ఉన్నాయి? అనే విషయాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందులో భాగంగా కొత్తగా సర్కారు పాఠశాలలకు అవసరమైన వసతిగృహాలు, అద్దె భవనాలు ఎక్కడెక్కడా ఉన్నాయో.. ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ భవనాలు ఏమైనా ఉన్నాయా.. అని పరిశీలిస్తున్నారు. ఫర్నిచర్ బోర్డులు, విద్యా సామగ్రి కోసం అవసరమైన బడ్జెట్ కలెక్టర్ ద్వారా సమకూర్చనున్నారు. కొత్త పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రారంభం కానున్నాయి. వీటికి అనువైన భవనాలు దొరుకుతాయా? లేదా? తేలాల్సి ఉంది.

కొత్తవి ఇక్కడే..

20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్నా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు అందుబాటులో లేని గ్రామీణ ఆవాసాలు, పట్టణ ప్రాంతాల్లో వార్డుల జాబితాను విద్యాశాఖ అధికారులు రూపొందించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 20 చోట్ల పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. మంచిర్యాల జిల్లాలో 15 చోట్ల ప్రారంభించనున్నారు. ఇందులో బెల్లంపల్లి మండలం సోమగూడెం, క్యాతన్‌పల్లిలోని వార్డు నంబర్-17 ('బీ' జోన్ పార్ట్), శ్రీనివాస నగర్, శేషుపల్లి విలేజీ, నాగార్జున కాలనీ క్వార్టర్, కాకతీయ కాలనీ, నస్పూర్‌లోని సుభాష్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, లక్సెట్టిపేట్‌లోని గోదావరి రోడ్ వీకర్ సెక్షన్, గొల్లగూడ మోదేల, మందమర్రి మండలంలోని బురదగూడెం, పాకిస్తాన్‌క్యాంపు, మంచిర్యాలలోని హైటెక్‌సిటీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, గోసేవా మండల్‌లో 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్నట్లు గుర్తించి పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మీవాడ-1, డబుల్‌బెడ్‌రూం (ఎల్లపల్లి), ఖానాపూర్ డబుల్ బెడ్‌రూం కాలనీ (కుమురం భీం ఎక్స్‌రోడ్), భైంసాలోని బాబ్లాగామ్, ఖానాపూర్‌లోని రంగాపేట్ గ్రామంలో అధికారులు కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలోనే కొత్త పాఠశాలలు ప్రారంభిస్తాం

కొత్తగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయి. విద్యార్థులుండి ప్రభుత్వ పాఠశాలలు లేని చోట కొత్త బడులు ఏర్పాటు కానున్నాయి. పాఠశాలలకు అనుకూలమైన భవనాలు, మౌలిక వసతులు సమకూర్చడంపై దృష్టి సారించాం. వీలైనంత త్వరలోనే కొత్త బడులు ప్రారంభం కానున్నాయి. ఇదివరకు పిల్లలు తక్కువగా ఉండి.. టీచర్లు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి కొత్త పాఠశాలలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపిస్తాం.

– యాదయ్య, మంచిర్యాల డీఈవో

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం పీఈటీ

వేమనపల్లి: మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిధర్ రెడ్డి, పీఈటీ దాసరి మల్లేశ్ తెలిపారు. వశాక రజిత, అల్వియ మహివీన్, చింతల మహేశ్వరి, కొట్రంగి అనూష సత్తాచాటారు. హన్మకొండలో జవహర్‌లాల్ స్టేడియంలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొత్త ప్లాంట్ నిర్మాణ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మూడో యూనిట్ (800మెగా వాట్ల) థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని అధికారులు వివరించారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సింగరేణి ఉద్యోగి, ఉత్తమ జ్యోతిష్య, జాతీయ ప్రతిభ రత్న, బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ దూళిపాళ్ల మల్లికార్జునశర్మను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జ్యోతిష్యంపై మక్కువతో మల్లికార్జునశర్మ బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి జ్యోతిష్యశాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. సాయంత్రం 5గంటలకు సంస్థ సీఎండీ బలరాం థర్మల్ పవర్ ప్లాంట్, సోలార్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకత మీద నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎంలు శ్రీనివాసులు, నరసింహారావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏఐటీయూసీ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ సెక్రటరీ సంతోష్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, మదన్‌మోహన్, డీజీఎం కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌తో జాగ్రత్త

- పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం
- సీజన్‌కు అనుగుణంగా టీకాలు తప్పనిసరి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

మంచిర్యాలఅగ్రికల్చర్: కుక్కలు, పశువులు, కోళ్లు, పక్షుల నుంచి మనుషులకు సక్రమించేవి జూనోసిస్ వ్యాధులు అంటారు. పశువుల పాకల అపరిశుభ్రత, తదితర కారణాల వల్ల సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధులపై పశుపోషకులు, జంతు ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. దీనిపై అవగాహన కల్పించి, ఆ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి శంకర్ పేర్కొంటున్నారు. పశువుల కాపర్లు, పశువైద్యులు, కుక్కలు, పక్షులు పెంచేవారు, పశువుల డెయిరీ ఫాంలో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలి. పెంపుడు కుక్కలను పెంచడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శుచి, శుభ్రత పాటించడం ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.



జిల్లా పశువైద్యాధికారి ఈ.శంకర్

ఇదే రోజు ఎందుకు?

1885 జూలై 6న లూయిస్ ప్యాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తారు.



పెంపుడు కుక్క ల్యాబ్‌బ్రాడర్

పిచ్చికుక్క కాటుతో..

పిచ్చికుక్కకాటు వల్ల పశువులు, కుక్క కరిచిన మనుషులకు రేబిస్ సోకుతుంది. ఈ వ్యాధి ప్రాణాంతకమైనది. పిల్లులు, ముంగిసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు ఈ వ్యాధి సోకుతుంది. కుక్క కరిచిన తర్వాత 2 నుంచి 3 వారాల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి 5 నుంచి 6 నెలల తర్వాత బయటపడుతాయి. కుక్కల ద్వారా గజ్జి వంటి చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పిచ్చికుక్కకాటుకు గురై పశువులు, మనుషులు మృత్యుబారిన పడుతుంటారు.

అంత్రాక్స్- బ్రూసెల్లోసిస్

పశువుల నుంచి మనుషులకు దొమ్మ(అంత్రాక్స్), బ్రూసెల్లోసిస్ తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. సరిగా వైద్యం చేయిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. దీని నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. కలుషితమైన పాలు తాగితే క్షయ సోకుతుంది. పందులు, కొంగలు నివాస ప్రాంతాలకు చేరువలో ఉన్నప్పుడు మనుషులు వీటి ద్వారా కూడా మెదడు వాపు సోకవచ్చు. పందులు, దోమలను అరికడితే ఈ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చు.

పెంపుడు కుక్కలకు ప్రతీఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) ఇప్పిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. సీజన్‌కు అనుగుణంగా పశువులు, పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకా సకాలంలో వేయించాలి. పెంపుడు కుక్కలకు మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90వ రోజు టీకాలు వేయించాలి.

సకాలంలో టీకాలు వేయించాలి

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసాన్ని సరిగా ఉడకని గుడ్లు తినవద్దు. చెడిపోయిన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకోవద్దు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగవద్దు. పాడి పశువులు, జంతువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. కాలానికనుగుణంగా పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు రోగ నిరోధక టీకాలు వేయించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూరప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నంచల్లి పూడ్చిపెట్టాలి.

పాలిటెక్నిక్ సీట్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో యాజమాన్యం కోటా సీట్లు భర్తీ చేశారు. శనివారం కౌన్సెలింగ్‌కు కంపెనీ ఉద్యోగుల పిల్లలు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలు హాజరయ్యారు. మొత్తం సీట్లలో యాజమాన్యం కోటా కింద సగం సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. ప్రతీ కోర్సుల్లో 30 సీట్ల చొప్పున 150 సీట్లు ఉండగా, కౌన్సెలింగ్‌లో 84 మంది విద్యార్థులు సీట్లు పొందారు. మొదటి సీటును 1,445 ర్యాంకు సాధించిన ఈ.సుజల్ అనే విద్యార్థి కంప్యూటర్స్‌లో సీటు పొందగా, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రావు ఆయనకు అడ్మిషన్ అందించారు. మిగిలిన సీట్లలో.. సివిల్‌లో 26, కంప్యూటర్స్‌లో 01, ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 5, మెకానికల్‌లో 24, మైనింగ్‌లో 10 సీట్లను త్వరలో స్పాట్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్, హెచ్ఓడీలు జి.దామోదర్, జి.రవీందర్, నరసింహాస్వామి, శ్యామల, కె.సుమన్ పాల్గొన్నారు.



అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

చోరీ సామగ్రిని తిరిగి వదిలిన ఆగంతకులు

బెల్లంపల్లి: మండలంలోని గురిజాల రైతువేదిక నుంచి అపహరించుకు వెళ్లిన సామగ్రిని ఆగంతకులు తిరిగి అక్కడే వదిలివెళ్లారు. గురువారం రాత్రి రైతు వేదిక తాళం పగులగొట్టి అందులో సామగ్రిని పట్టుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వ్యవసాయ అధికారులు తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సామగ్రిని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు 24 గంటల వ్యవధిలో శుక్రవారం రాత్రి ఆ రైతు వేదిక వద్ద తీసుకువచ్చి వదిలివెళ్లారు. బెల్లంపల్లి ఏడీఏ రాజా నరేందర్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దిన్, తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేశ్, ఏవో ప్రేమ్‌కుమార్ శనివారం ఉదయం అక్కడికి చేరుకుని చోరీకి గురైన సామగ్రిని పరిశీలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ చేస్తామని వ్యవసాయ, పోలీసు అధికారులు తెలిపారు.



గురిజాల రైతువేదిక వద్ద వదిలివెళ్లిన సామగ్రి

రోడ్డు ప్రమాదం.. పశువుల యజమానిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదానికి కారణమైన పశువుల యజమానిపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్సింగాపూర్‌కు చెందిన ఏనుగు జయపాల్‌రెడ్డి శనివారం ఉదయం కారులో మంచిర్యాల నుంచి నర్సింగాపూర్‌కు వెళ్తున్నాడు. వేంపల్లిలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా మూడు బర్రెలు అడ్డు వచ్చాయి. దీంతో కారు బర్రెలను ఢీకొట్టి ధ్వంసం కాగా.. జయపాల్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మూడు బర్రెలు మృతిచెందాయి. పశువులను ఇంటి వద్ద, కొట్టంలో ఉంచాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాత మంచిర్యాల జ్యోతినగర్‌కు చెందిన పశువుల యజమాని కార్ల మల్లేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశామని ఎస్సై తెలిపారు. పశువులను యజమానులు ఇళ్లు, కొట్టాల్లో కాకుండా రహదారులపైకి వదిలి ఇతరుల ప్రాణాలకు హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

12న చెట్ల తొలగింపునకు వేలం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్) వరకు (హైదరాబాద్-కరీంనగర్-చాందా రోడ్డు 251/9 నుంచి 255/7 కిలోమీటర్లు) విస్తరణలో భాగంగా ఇరువైపులా 63 చెట్ల తొలగింపునకు ఈనెల 12న వేలం పాట నిర్వహిస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

రామకృష్ణాపూర్: అనుమతులు లేకుండా ఇష్టానురీతిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యుడు వనం సత్యం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది ఆర్ఎంపీలు ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారన్నారు. ఆర్‌కేపీలో ఓ ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే శ్రీనాథ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు ఇంజక్షన్ వికటించి మృతిచెందాడని అన్నారు. ఆ వైద్యుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. బాధితుడి పక్షాన కాకుండా స్థానిక కొంతమంది నాయకులు ఆర్ఎంపీ పక్షాన నిలుస్తూ సెటిల్‌మెంట్లకు యత్నించడం బాధాకరమన్నారు. యువకుడి ప్రాణాన్ని రూ.2 లక్షలకు విలువ కట్టడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, నక్క వెంకటస్వామి, సాంబయ్య, పాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన తడక దినేశ్ (29) అనుమానాస్పదంగా మృతిచెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన స్నేహితులు వెంటనే అతన్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ నిద్రమాత్రలు లభించాయని, ఆ మాత్రలు వేసుకుని దినేశ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నామని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కాగా, అమెరికాలో ఉన్న కూతురు మౌనిక వద్దకు తల్లిదండ్రులు పద్మావతి, రవి ఇటీవల వెళ్లారు. దీంతో వారు తిరిగి వచ్చేవరకు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. వారి ఫిర్యాదు అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తామని పట్టణ ఎస్సై తెలిపారు.



దినేశ్ (ఫైల్)

చికిత్స పొందుతూ మహిళ మృతి

సోన్: పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదాపూర్‌కు చెందిన సల్ల భోజవ్వ (54)కు కుమారుడు నరేశ్ ఉన్నారు. నరేశ్‌కు పెళ్లి చేసింది. పదేళ్ల క్రితం భర్త నరేశ్‌తో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భోజవ్వ బాధపడుతుండేది. కోడలు రావడం లేదని మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం సాయంత్రం ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. కుమారుడు నరేశ్ గమనించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అనీస్ రైల్వేస్టేషన్ ఎదుట నుంచి వెళ్తున్న మహిళలు, యువతులను వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు. పలువురు షీ టీంకు సమాచారం అందించగా.. అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

ఇచ్చోడ: అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని దేవుల్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ గంభీర్‌సింగ్ శనివారం వ్యవసాయ పొలంలో పనిచేస్తున్నాడు. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన అడవి పంది ఒక్కసారిగా అతనిపై దాడి చేయగా తప్పించుకునే క్రమంలో జారిపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గంభీర్‌సింగ్‌ను అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దివాకర్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఒల్లెపు వెంకటేశ్(40), సుజాత దంపతులు. వీరికి కుమారుడు గణేశ్, కూతుళ్లు బిందు, దివ్య ఉన్నారు. కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవా రు. వెంకటేశ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తరచూ గొడవలు జరిగేవి. ఎదిగిన పిల్లలు ఉన్నారని, మద్యం తాగుడు మానేయాలని భార్య మందలించడంతో వెంకటేశ్ మనస్తాపం చెందాడు. శుక్రవారం ఎఫ్‌సీఐ గోదాము వెనుకాల మద్యం మత్తులో పురుగుల మందు తాగి చనిపోతున్నానని కుటుంబీకులకు ఫోన్‌చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.



వెంకటేశ్ (ఫైల్)

నకిలీపత్రాలు సృష్టిస్తున్న ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- తండ్రి అరెస్ట్, పరారీలో కుమారుడు
- కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్రభుత్వ శాఖల నకిలీపత్రాలు, స్టాంపులు, అధికారుల సంతకాల స్టాంపులు సృష్టించే ముఠాను ఆదిలాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. డాక్యుమెంట్ రైటర్ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేశారు. తండ్రిని అరెస్ట్ చేయగా కుమారుడు పరారీలో ఉన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లాడ్వే బద్రినాథ్ కుమారుడు రాహుల్‌కుమార్. ఇతను డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. గత మూడేళ్లుగా తండ్రి కుమారుడు నకిలీపత్రాలు, స్టాంపులు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదు అందింది. పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి వారి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. వివిధ జిల్లాల్లో శాఖల అధికారుల సంతకాలతో కూడిన స్టాంపులు, పత్రాలు, వాటిని తయారుచేసే రసాయనాలు, పరికరాలు, కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నకిలీ పత్రాలతో అక్రమాలు

మావల మండలంలోని సర్వేనంబర్ 170లోని ప్లాట్ల పత్రాలను మండల రెవెన్యూ అధికారి కేటాయించినట్లుగా సృష్టించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ నకిలీపత్రాలు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన, ఆర్టీవో వాహన రిలీజ్ పత్రాలు, ఆధార్‌కార్డులతోపాటు వివాహ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారు. వివిధ హాస్పిటల్స్‌కు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి ప్రభుత్వం ద్వారా కొంతమందికి విక్రయించి లబ్ధిని పొందేలా చూశారు. మహాలక్ష్మి మ్యాన్‌పవర్ అండ్ ప్లేస్మెంట్స్ సర్వీసెస్ అనే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నకిలీ ఉద్యోగ నియామకపత్రాలు తయారు చేసి మోసగించారు. నకిలీ పత్రాలతో ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీస్ బృందాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.సునీల్ కుమార్‌లను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ డాక్యుమెంట్లు, పట్టాలు

నేడు తొలి ఏకాదశి

- చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభం
- కిటకిటలాడనున్న ఆలయాలు

చెన్నూర్: తొలి ఏకాదశి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆషాఢశుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. సంవత్సరం మొత్తంలో 24 ఏకాదశులు ప్రతినెల కృష్ణపక్షంలో ఒకటి, శుక్లపక్షంలో ఒకటి మొత్తం రెండు ఏకాదశులు వస్తాయి. ఆదివారం తొలి ఏకాదశి పండగ నుంచే చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభమవుతాయి. ఆషాఢ శుక్ల పక్షం నుంచి కార్తీక శుక్లపక్షం వరకు చాతుర్మాస్య దీక్షలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమిస్తారు. దీన్ని శయన ఏకాదశి అని పిలుస్తారు. నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి మేల్కొంటారు. ఈ నాలుగు నెలల కాలాన్ని ప్రజలు పవిత్ర నెలలుగా భావించి చాతుర్మాస్య దీక్షలు చేస్తారు.

పండగ విశిష్టత..

భక్తులు సూర్యోదయానికి ముందే గోదావరినదిలో స్నానాలు అచరించి మహావిష్ణువు ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. చాతుర్మాసం ప్రారంభం కానుండడంతో శ్రీ మహావిష్ణువు ఆలయాలు కిటకిటలాడుతాయి. తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి తర్వాత రోజు మహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి భోజనం చేస్తారు.



చెన్నూర్ జగన్నాథాలయం

వ్రతాలు ఆచరించాలి

తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతాలు ఆచరించాలి. శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమించే రోజు కావడంతో తొలి ఏకాదశి రోజున ఉపవాసం చేసి మహవిష్ణువు పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి.

– వేమారం మహేశ్వర్‌శర్మ, అర్చకుడు, శివాలయం



భూకబ్జాకు పాల్పడిన 9 మందిపై కేసు

- ఐదుగురి అరెస్ట్, పరారీలో నలుగురు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: భూమి పత్రాలను ఫోర్జరీ చేసి, ప్లాట్లను కబ్జా చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ యజమానులను బెదిరించిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీసుస్టేషన్‌లో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని భుక్తపూర్ కాలనీకి చెందిన జనకొండ పోసాని 2009లో ఖానాపూర్ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 68/44/1లో 30, 38 నంబర్ గల రెండు ప్లాట్లు కొనుగోలు చేశారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పైక్‌రావు ఆనంద్ (మాజీ కౌన్సిలర్ కుమారుడు), సద్దాం హుస్సేన్, షేక్ షాదుల్లా, బోడకుంట రాజు, అజీముద్దీన్, సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ ప్లాట్లను కబ్జా చేశారు. మున్సిపల్ అధికారులను మోసం చేసి ఇంటి నంబర్లు పొందారు. దీంతో బాధితురాలు ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శుక్రవారం ఐదుగురు నిందితులు పైక్ రావు ఆనంద్, సద్దాం, షేక్ షాదుల్లా, బోడకుంట్ల రాజు, షేక్ అజీముద్దీన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా నలుగురు సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అరెస్టైన వారిని 15 రోజుల రిమాండ్‌కు తరలించారు. ప్లాట్ ఇంటి నంబర్లకు సహకరించిన మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, రెవెన్యూ ఆఫీసర్ జాదవ్ కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో శనివారం రాత్రి కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా ఎలాంటి పత్రాలు లేని 30 బైక్‌లు, బెల్ట్ షాపుల వద్ద నుంచి సుమారు రూ.10 వేల విలువ గల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఏర్పాట్లపై అధికారులతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో ఈనెల 7, 8, 9 తేదీల్లో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడ్మిషన్ల కన్వీనర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ దేవరాజు, బండి హరికృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.